సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



ముగిసిన కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ముగిశాయి. శ్రీపుష్ప యాగోత్సవం నేత్రపర్వంగా జరిగింది.



ఆకట్టుకున్న కోలాటం

కామవరపుకోట: కామవరపుకోటలో వీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవం జరిగింది. కోలాట నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

సంతానలక్ష్మి పాహిమాం

భీమవరం(ప్రకాశం చౌక్): కొలిచిన వారికి కొంగు బంగారం భీమవరం మావుళ్లమ్మవారు ఆలయ 59వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం సంతాన లక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.



న్యూస్‌రీల్


'వట్టి' సేవలు ఎనలేనివి



వట్టి వసంతకుమార్ తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

భీమడోలు: మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి రాష్ట్రానికి తీరని లోటని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే, పశ్చిమగోదావరి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పూళ్ల పరిధిలోని ఎంఎం పురంలోని నివాసంలో వసంతకుమార్ చిత్రపటం వద్ద సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసంతకుమార్ తండ్రి వెంకట రంగ పార్థసారధి, సోదరుడు రమేష్, కుమారుడు పవన్‌ను ఆయన పరామర్శించారు. వసంత్ ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నిర్ణీత సమయంలో చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

సాక్షి, భీమవరం: సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 11 మంది నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. సివిల్, కుటుంబ తగాదాలకు సంబంధించి బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో చర్యలు తీసుకుని నివేదికను అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. భీమవరం సబ్ డివిజన్‌కు సంబంధించి నాలుగు, నరసాపురం సబ్ డివిజన్‌కు సంబంధించి ఏడు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.

హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్ బి వ్యాక్సిన్ వరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్ బి వ్యాక్సిన్ వరమని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డా. భానునాయక్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డా.ఎం.వీరాస్వామి అన్నారు. సోమవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని ఏఆర్టీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ బాధితులు, హైరిస్క్‌తో జీవిస్తున్న వారికి హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమవరం ప్రభుత్వాస్పత్రి వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఏఆర్టీ సీనియర్ వైద్యాధికారి ఎం.గోవింద బాబు మాట్లాడుతూ జిల్లాలో 13,940 మంది హెచ్‌ఐవీ బాధితులుండగా 5,933 మందికి హెపటైటిస్ పరీక్షలు చేశామన్నారు. వీరిలో 5,788 మందికి హెపటైటిస్ లేనట్టు నిర్ధారించామన్నారు. ప్రత్యేకంగా గర్భిణులు, బాలింతలు, ఇతర వ్యాధులతో జీవిసున్నవారు, ఏఆర్టీ, సీపీటీ మందులు తీసుకుంటున్నా హెపటైటిస్ టీకా వేయించుకోవాలన్నారు. రూ.3 వేల విలువైన టీకాలను ఏఆర్టీ కేంద్రాల్లో వైద్యుల పర్యవేక్షణలో నెలకు ఒక డోసు చొప్పున మూడు డోసులు ఉచితంగా వేస్తామన్నారు. డాక్టర్లు వి.రాంబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్సీల మధ్య చిచ్చుపెట్టిన చంద్రబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చంద్రబాబునాయుడు ఎంఆర్‌పీఎస్ ఉద్యమానికి మద్దతు ప్రకటించి ఎస్సీల మధ్య చిచ్చు పెట్టాలని చూసి, మాలల ఆగ్రహానికి గురై భంగపడ్డారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో తమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు తాను వినతి పత్రం అందించినట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించి ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

వేగంగా రీ సర్వే పనులు

జాయింట్ కలెక్టర్ మురళి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రీ సర్వే పనులు వేగంగా పూర్తిచేసి మంచి ఫలితాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు భీమవరం కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూసర్వే, ఇళ్ల స్థలాలు, భూహక్కు పత్రాల పంపిణీ, జాతీయ రహదారులు, గోదాములు తదితర 15 అంశాలపై సమీక్షించారు. నిర్ణీత సమయంలోపు రీ సర్వే పూర్తిచేయాలని, ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆదేశించారు. రికార్డులు పక్కాగా తయారు చేయాలని సూచించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా సహకార అధికారి ఎం.రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దంపతులకు శుభలేఖ అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వానం

నరసాపురం : ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, శారదావాణి దంపతులు సోమవారం సాయంత్రం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతులను కలిశారు. వచ్చేనెల 5వ తేదీన ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ లక్ష్మీ సింధూజ వివాహం నిశ్చయమైంది. తమ కుమార్తె వివాహానికి సతీసమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించాలని సీఎం జగన్‌కు శుభలేఖ అందించి ముదునూరి దంపతులు కోరారు. ప్రసాదరాజు కుమారుడు శ్రీకృష్ణరాజు వారి వెంట ఉన్నారు.

సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జట్లపాలెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పరిపాలన వికేంద్రీకరణ పేరుతో నూతన సచివాలయాల వ్యవస్థ ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జట్లపాలెంలో కోనేరు చెరువు వద్ద నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నూరు శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, ఇతర కట్టడాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ ఖండవల్లి మణీరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్, ఏఈ ఉన్నమట్ల నవీన్, తహసీల్దార్ జేవీ శేషగిరిరావు, ఎంపీడీఓ దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లను కాపాడుకోవాలి

నూజివీడు: శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను పెంచే రైతులు వాటిని రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. పట్టణంలోని పైడి అప్పారావు మర్చంట్స్ అసోసియేషన్ హాలులో సోమవారం నూజివీడు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శ్రీగంధం, ఎర్రచందనం చెట్లు పెంచే రైతులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో ఎంత మంది రైతులు ఎన్ని చెట్లు పెంచుతున్నారనే అంశాలను సేకరిస్తున్నామన్నారు. నూజివీడు, పెదవేగి, పెదపాడు మండలాల పరిధిలో వీటిని పెంచుతున్నారన్నారు. వీటిని పెంచే తోటల్లో కాపలాదారులను ఏర్పాటు చేసుకోవడం, సీసీ కెమెరాలను పెట్టడం ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులంతా పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ ఆర్.అంకబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుదీకరణలో ప్రథమం

కాలనీల్లో కాంతులు

- చురుగ్గా సాగుతున్న పనులు
- ఇప్పటికే 300 కాలనీల్లో పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 8 సబ్‌స్టేషన్ల మంజూరు
- ఈపీడీసీఎల్ పరిధిలో ఏలూరు సర్కిల్ ఫస్ట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలాలను మంజూరు చేసి గృహనిర్మాణాలకు తోడ్పాటు అందిస్తున్నారు. దీనిలో భాగంగా పల్లెపల్లెనా జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. ఇంటి నిర్మాణంతో పాటు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా విద్యుదీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,144 జగనన్న కాలనీల్లో 1,39,348 మందికి ఇంటి పట్టాలు అందించారు. ఇప్పటికే 300 కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తిచేసి ఇంటింటా విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

8 సబ్‌స్టేషన్ల నిర్మాణం

జగనన్న కాలనీలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఉమ్మడి జిల్లాలో 8 నూతన సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు. ఏలూరు జిల్లాలో చొదిమెళ్ల, కొమడవోలు, పోణంగి ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో పైడిపర్రు, గునుపూడి, కువ్వనపూడి, విస్సాకోడేరు, రుస్తుంబాదలో సబ్‌స్టేషన్లు మంజూరు కాగా గునుపూడి, విస్సాకోడేరులో స్థల సేకరణ చేస్తున్నారు. మిగిలిన చోట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఏప ట్రాన్స్‌ఫార్మర్లంటే.. కాలనీల్లో విద్యుత్ స్తంభాలను వేయడం, హెచ్‌టీ లైన్లు, ఎల్‌టీ లైన్లు ద్వారా ఫీడర్లను అనుసంధానిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా కాలనీల్లో ఇప్పటివరకూ 399 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. వీటిలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 5, 100 కేవీఏ 214, 63 కేవీఏ 38, 40 కేవీఏ 28, 25 కేవీఏ 4, 16 కేవీఏ 116 ఉన్నాయి.



జగనవరం మండలం కాకిలేరులో జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న అధికారులు



అత్తిలి మండలం వరిఘేడులో విద్యుత్ పనుల్లో నిమగ్నమైన ఈపీడీసీఎల్ సిబ్బంది

వారంలో మరో 40 కాలనీల్లో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 300 కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తికాగా.. 4,311 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. వాటన్నింటికీ అధికారులు సర్వీసులు అందించి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అలాగే మరో 2,626 ఇళ్లకూ సర్వీసులు ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు. వీటితో పాటు మరో 93 కాలనీల్లో 35,589 ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతుండగా విద్యుదీకరణ పనులూ కొనసాగుతున్నాయి. వీటిలో సుమారు 40 కాలనీల్లోని ఇళ్లకు వచ్చే వారంలో సర్వీసులు అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యుదీకరణ ఇలా..

పనులు పూర్తయిన కాలనీలు	300
పనులు జరుగుతున్న కాలనీలు	597
విద్యుత్ స్తంభాలు	18,826
హెచ్‌టీ లైన్లు (కిలోమీటర్లు)	43.77
ఎల్‌టీ లైన్లు (కిలోమీటర్లు)	237.67
ట్రాన్స్‌ఫార్మర్లు	399
వెచ్చించిన మొత్తం (రూ. కోట్లు)	18.60

వేగంగా పనులు



జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులను వేగంగా పూర్తిచేస్తూ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఈపీడీసీఎల్ పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటికే 300 కాలనీల్లో నిర్మితమైన అన్ని గృహాలకూ సర్వీసులు అందించి విద్యుత్ సరఫరా సైతం చేస్తున్నాం. ఈపీడీసీఎల్ డిస్కం పరిధిలో శ్రీకాకుళం సర్కిల్‌లో 74 కాలనీలు, విజయనగరం సర్కిల్‌లో 203 కాలనీలు, విశాఖ సర్కిల్‌లో 228 కాలనీలు, రాజమహేంద్రవరం సర్కిల్‌లో 244 కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఏలూరు సర్కిల్ పరిధిలో మరో 597 కాలనీల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– పి.సాల్మన్ రాజు, ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ

సమస్యల పరిష్కారానికి బాసటగా 'స్పందన'

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు బాసటగా నిలవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో భాగంగా ఆమె అర్జీలు స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా చదివి కాలయాపన లేకుండా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమస్యకు పూర్తి పరిష్కారం చూపినప్పుడే అర్జీదారుడి మన్ననలను పొందగలుగుతామన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా 172 అర్జీలను స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..: ఆకివీడు మండలం అయి భీమవరానికి చెందిన గొట్టుముక్కల వెంకట రామరాజు అర్జీని అందిస్తూ చేపల చెరువు భూమిని మ్యూటేషన్ చేయాల్సిందిగా కోరారు.

- వీరవాసరం మండలం బాలేపల్లిలో కొందరు అక్రమంగా ఆక్వా సాగుచేస్తున్నారని సందీప్ జయరాజు ఫిర్యాదు చేశారు.
- వేంప్ర ప్రాథమిక పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కొందరు తల్లిదండ్రులు కోరారు.
- ఇంటర్ ప్రాక్టికల్స్‌కు కొన్ని కార్పొరేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఏటీపీపీ సహాయ కార్యదర్శి కె.దిన్ను చందు ఫిర్యాదు చేశారు.

ఆక్వాజోన్ సర్వేపై.. ఆక్వాజోన్ సర్వేలో ఆక్వా సాగు భూములతో పాటు సాగుకు అనుకూలమైన భూములను కూడా గుర్తించి నివేదికలో పొందుపరచాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఫిష్ ఆంధ్రాపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.లక్ష నుంచి రూ.3.50 లక్షల విలువైన 82 మినీ రిటైల్ అవుట్‌లెట్లు, రిటైల్ వెండింగ్ ఫుడ్ కోర్టులు, మొబైల్ యూనిట్లకు ఈనెల 10లోపు రుణాలు మంజూరు చేయాలన్నారు. పాలకొల్లు, భీమవరం, నరసాపురం, పాలకోడేరులో ఏర్పాటు చేయనున్న ఫిష్ హబ్బులకు బ్యాంకు లింకేజీ పూర్తిచేయాలన్నారు. ఫిష్ ఆంధ్రాతో ఆక్వా ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయన్నారు. ఆక్వా జోన్ గుర్తింపు సర్వేను పారదర్శకతతో పూర్తి చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారి వి.రాజేకుమార్, మత్స్య శాఖ ఏడీ ఈ.ఆనందరావు, డీఆర్‌డీఏ డీపీఎం ఎస్.కుసుమకుమారి పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



నమో వేంకటేశా

దెందులూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ మహోత్సవాల్లో భాగంగా సోమవారం పులిహోరలో శ్రీవారి ప్రతిమను తీర్చిదిద్దారు. బాలాజీ టెంపుల్ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు.

- దెందులూరు

లక్ష్యం దిశగా.. వడివడిగా..

- గ్రామాల్లో 'ఉపాధి' పనులు
- 31.61 లక్షల పనిదినాల కల్పన
- చెరువులు, బోదెల తవ్వకాలు
- 79 శాతం మేర పూర్తయిన లక్ష్యం



పెనుమంట్రలో చెరువు తవ్వకం పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. అన్ని మండలాల్లో కూలీలతో పనులు చేయిస్తున్నారు. ముఖ్యంగా చెరువుల తవ్వకం, పంట బోదెలు బాగుచేత వంటి పనులు జరుగుతున్నాయి. అన్ని గ్రామాల్లో కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేలా అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు వేతనం రూ.257 చొప్పున అందిస్తున్నారు.

రూ.72.72 కోట్ల చెల్లింపు

జిల్లాలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి 40 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకూ 31.62 లక్షల పనిదినాలు కల్పించారు. కూలీలకు వేతనాల రూపంలో రూ.72.72 కోట్లు చెల్లించారు. పనుల లక్ష్యం 79 శాతం మేరకు పూర్తిచేశారు. నూరుశాతం లక్ష్యాన్ని సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

అమృత్ సరోవర్‌లో..

జిల్లాలో అమృత్ సరోవర్ పథకంలో చెరువుల తవ్వకాలను ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టారు. యంత్రాలు వినియోగించకుండా ఉపాధి హామీ కూలీలతో చెరువులను తవ్విస్తూ పేదలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ పనులు జిల్లాలో నాలుగు చోట్ల జరుగుతున్నాయి. పోడూరు, అత్తిలి మండలం పాలూరు, పెనుమంట్ర, నరసాపురంలో చెరువు తవ్వకాలు చురుగ్గా సాగుతున్నాయి.

రోజుకు 6 వేల మందితో..

జిల్లాలో రోజుకు సుమారు 6 వేల మందికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నారు. వచ్చేనెల నుంచి రోజుకు 50 వేల మందికి పైగా పనులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే ప్రతి కుటుంబానికి 100 రోజుల పనుల కల్పన లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలోని 19 మండలాల్లో సుమారు 3 లక్షల మంది ఉపాధి కూలీలు ఉండగా 1.22 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి.

ముమ్మరంగా సాగుతున్నాయి



జిల్లాలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువులు, ఇతర పనులు కూలీలు చేస్తున్నారు. వచ్చేనెల 31 నాటికి 40 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకూ 31.62 లక్షల పనిదినాలు కల్పించాం. అమృత్ సరోవర్ పథకంలో కూలీలతో చెరువు తవ్వకాలు చేపట్టాం. రోజుకు 6 వేల మందికి పనులు కల్పిస్తున్నాం. ఈ సంఖ్య క్రమేపీ పెరగనుంది.

– ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డ్వామా పీడీ, భీమవరం

రెవెన్యూ స్పందనపై సమీక్ష

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో స్పందన ద్వారా స్వీకరిస్తున్న రెవెన్యూ అర్జీల పరిష్కార నాణ్యతపై సోమవారం తహసీల్దార్లు, ఎంపీడీఓలతో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతేడాది నవంబర్ నుంచి వచ్చిన 75 రెవెన్యూ అర్జీలపై సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలోకి స్వయంగా అధికారులు వెళ్లి విచారణ చేపట్టాలన్నారు. ఎండార్స్‌మెంట్ పొందిన ఓ అర్జీదారునికి ఫోన్ చేసి సమస్య పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ద్వారకాతిరుమల, దెందులూరు, గణపవరం, చింతలపూడి, బుట్టాయగూడెం తదితర మండలాల అర్జీలపై సమీక్ష జరిగింది. డీఆర్వో ఏవీ ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి: మండలంలోని పర్వతపురం గ్రామంలో మిద్దె నరసింహరావు పౌల్ట్రీ ఫాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 1.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. 6 ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు.

ఏసురాజుకు పరామర్శ



నూకయ్యకు నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

గణపవరం: వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధినేత వేగేశ్న ఏసుదాతరాజు సతీమణి శ్రీమతి నూకయ్య(82) మరణం పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు. ఏసుదాతరాజు కుమారులు ఆనందరాజు, అనంతకోటిరాజులను పరామర్శించారు. వారిలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అకుల శేషసాయి, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యేలు రామానాయుడు, రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు ఉన్నారు.

హత్య కేసులో రిమాండ్

ఉంగుటూరు: ఉంగుటూరు దళితపేటలో యర్రారపు రాజేష్ మృతి కేసులో బుల్లిపాము నాగమణిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని.. కోర్టు రిమాండు విధించినట్లు చేబ్రోలు ఎస్సై స్వామి తెలిపారు. రాజేష్‌ని గెంటడంతో అతను మృతి చెందిన విషయం తెలిసిందే.

బాల్యానికి వెరీ'గుడ్'



పంపిణీకి సిద్ధం చేస్తున్న గుడ్లు



రంగు వేసిన గుడ్లు

ఆకివీడు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. ఆరు నెలల వయసు నుంచి పదో తరగతి చదివే విద్యార్థి వరకూ అందరికీ ప్రతీ రోజూ ఉడకబెట్టిన కోడిగుడ్డు వారంలో నాలుగు రోజుల పాటు అందిస్తున్నారు. అలాగే ఒకరోజు గుడ్డుకూర వడ్డిస్తున్నారు. నెలకు 25 గుడ్లకు తక్కువ కాకుండా ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందజేస్తుంది. అలాగే కోడిగుడ్ల సరఫరాలో ఎలాంటి అవినీతి తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోడిగుడ్ల సరఫరాలో పటిష్ట చర్యలు

కోడిగుడ్ల సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా, అవినీతికి తావులేకుండా కోడి గుడ్డుకు రంగులు వేస్తున్నారు. ప్రతీ పది రోజులకూ ఒక రంగు చొప్పున నీలం, పింక్, గ్రీన్ రంగుల ముద్రల్ని ఆయా గుడ్లపై వేసి సరఫరా చేస్తున్నారు. విద్యార్థులకు అందజేసే గుడ్లను మార్కెట్‌కు అక్రమంగా తరలించి, విక్రయించడానికి వీలులేకుండా రంగులు ఉపయోపడుతున్నాయి. ప్రభుత్వం వేసే రంగుల ముద్రలు కలిగిన గుడ్లను మార్కెట్‌లో విక్రయిస్తే ఇట్టే దొరికిపోతారు.

- వారానికి ప్రతీ విద్యార్థికి 5 గుడ్లు
- వారం వారం రంగు గుర్తుతో పంపిణీ
- అవినీతికి, నిల్వ గుడ్లకు చెక్

పిల్లల ఆరోగ్యం కోసం..

పిల్లల్లో పోషకాహారం లోపం లేకుండా చూసేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో వివిధ రకాలు వంటకాలు వడ్డిస్తున్నారు. ప్రతి రోజూ కొడిగుడ్డు ఉండేలా చూడడం వల్ల పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారు. కోడిగుడ్లలో అధిక క్యాలరీలు, పోషకాలు ఉంటాయి. ఐరన్, కొవ్వుతో పాటు విటమిన్-ఏ, పొటాషియం, కాల్షియం తదితర పోషకాలుంటాయి. గుడ్డు తినడం వల్ల ఎముకల బలం పెరుగుతుంది. కళ్ళకు ఏ విటమిన్ సమృద్ధిగా అందుతుంది. ప్రొటీన్ల వల్ల కండరాలకు బలం చేకూరుతుంది. పోషకాహార లోపం నివారించవచ్చు

	విద్యార్థుల సంఖ్య	గుడ్డు తినేవారు
పశ్చిమ గోదావరి జిల్లా	94,713	77,295
ఏలూరు జిల్లా:	1,16,632	1,10,268

ఉమ్మడి జిల్లాలో గుడ్డు తింటున్న అంగన్‌వాడీ పిల్లలు: 1,46,298

నాణ్యమైన గుడ్లు అందించేలా చర్యలు



పాఠశాలల విద్యార్థులకు క్రమం తప్పకుండా గుడ్లు అందజేస్తున్నాం. నాణ్యమైన గుడ్డును అందించేలా జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 82 శాతం మంది విద్యార్థులు గుడ్లు తింటున్నారు.

–ఆర్వీ.రమణ, డీఈఓ, పశ్చిమగోదావరి జిల్లా

గుడ్డుతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5 ఏళ్ల పిల్లల వరకూ అందరికీ కోడిగుడ్లు సరఫరా చేస్తున్నాం. గుడ్లు తినడం వల్ల చిన్న పిల్లలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. కంటి చూపు పెరుగుతుంది. పిల్లలు పుష్టిగా తయారవుతున్నారు.

–సుజాతారాణి, పీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, భీమవరం

వ్యాధినిరోధక శక్తి పెంపు



కోడిగుడ్డు తినడం వల్ల క్యాలరీస్ అధికంగా లభిస్తాయి. పోషకాలు ఉంటాయి. వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. వైరస్‌లు దూరంగా ఉంటాయి. విటమిన్-ఏ, ఐరన్, పొటాషియం, కాల్షియం ఉంటుంది. శరీరానికి ఉపయోగపడే కొవ్వు కూడా ఉంటుంది.

–డాక్టర్ ఎండీ.బిలాల్, వైద్యులు, ఆకివీడు

గత మూడేళ్లుగా తింటున్నాను



గత మూడేళ్లుగా వారానికి 5, నెలకు 25 కోడిగుడ్లు క్రమం తప్పకుండా ఇస్తున్నారు. గుడ్డు తినడం వల్ల ఆరోగ్యం బాగుంది. బలం చేకూరుతుంది. నీరసం వంటివి రావడంలేదు. గుడ్లు సరఫరా చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. – సొంబాబి మణికంఠ, తొమ్మిదో తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆకివీడు

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని జట్లపాలెంలో పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



యలమంచిలి: మండలంలోని చించినాడలో ప్రభుత్వ పనితీరు గురించి అడుగుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నూజివీడు: స్థానిక విక్టోరియా పురమందిరం ఆవరణలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాలబాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో భాగంగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బాలుర, బాలికల జట్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. బాలుర జట్టుకు కృష్ణాజిల్లా నుంచి బీ.బాలాజీ, కే.జగదీష్, బీ.శ్రీహరినాథ్, తూర్పుగోదావరి నుంచి కే.హర్షతేజ, కేజేవీ నారాయణ, అనంతపురం నుంచి కే.నంజయ్‌రెడ్డి, కే.సింహారెడ్డి, గుంటూరు నుంచి ఎంఎస్ సాయివెంకట్, చిత్తూరు నుంచి మహ్మద్ జునైద్ ఫాజిల్, వైజాగ్ నుంచి కే.ప్రిన్స్, పశ్చిమగోదావరి నుంచి ఎం.సోమశేఖర్, కర్నూల్ నుంచి పీ.ప్రజ్ఞనస్, స్టాండ్‌బై కింద కర్నూల్ నుంచి ఎండీ సాదిక్, తూర్పుగోదావరి నుంచి పీ.తేజన్యరూప్, పశ్చిమగోదావరి నుంచి ఎం.సాంబసూర్య, గుంటూరు నుంచి కే.వెంకట శివలు ఎంపికయ్యారు. బాలికల రాష్ట్ర జట్టుకు పశ్చిమగోదావరి నుంచి ఏ.రుత్విక, జీ.పూజిత, తూర్పు గోదావరి నుంచి ఎం.మౌనిక, ఎంఎల్ మానస, గుంటూరు నుంచి పీ.బాలశిరీష, ఎస్.కేజీయా, అనంతపురం నుంచి వీ.దీపికసాయి, కృష్ణా నుంచి బీపీ దీపిక, షేక్ అస్రా, చిత్తూరు నుంచి జీ.చందనప్రియ, కర్నూల్ నుంచి బీ.మౌనికబాయి, వైజాగ్ నుంచి ఆర్.భావనారెడ్డి ఎంపికయ్యారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

Regional Sponsor APMDC APMDC FOUNDATION

సాక్షి, భీమవరం: సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు 4వ రోజు సోమవారం హోరాహోరీగా సాగాయి. ప్రత్యర్థిని ఓడించేందుకు క్రీడాకారులు తమ నైపుణ్యాల్ని ప్రదర్శిస్తున్నారు. పదునైన పేస్‌తో, గింగిరాలు తిరిగే స్పిన్ బంతులతో బ్యాటర్లపై ఒత్తిడి తెస్తున్నారు. మొదటి మ్యాచ్‌లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌కేఆర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. అనంతరం విష్ణు కళాశాల జట్టు 9.2 ఓవర్లలో 4 వికెట్ల కోల్పోయి 79 పరుగుల లక్ష్యాన్ని చేధించి, 6 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. రెండో మ్యాచ్ రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఏలూరు, తణుకు శ్రీమారుతి డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రామచంద్ర కళాశాల జట్టు ప్రత్యర్థిని కట్టుదిట్టమైన బౌలింగ్‌తో 39 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం 4.3 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని చేధించి 10 వికెట్లు తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. మూడో మ్యాచ్‌లో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల, పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ కెవిఎస్ రాజు డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన స్వర్ణాంధ్ర జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 80 పరుగుల స్కోరు సాధించింది. అనంతరం ప్రత్యర్థి జట్టును 56 పరుగులకే కట్టడి చేసి విజయాన్ని నమోదు చేసింది. 4వ మ్యాచ్‌లో ఏలూరు సర్‌సీఆర్ రెడ్డి కళాశాల, తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సీఆర్ రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 73 స్కోరు నమోదు చేసింది. అనంతరం నిడదవోలు జట్టును 31 పరుగులకే ఆలౌట్ చేసి విజయాన్ని అందుకుంది.

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP



మొదటి మ్యాచ్‌లో విజేతగా నిలిచిన భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు



రెండో మ్యాచ్‌లో విజేతగా ఏలూరు రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జట్టు



మూడో మ్యాచ్ విజేతగా స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు



నాలుగో మ్యాచ్ విజేతగా నిలిచిన ఏలూరు సర్ సీఆర్ రెడ్డి కళాశాల జట్టు

రేషన్ వ్యాన్లపై దాడి



పెనుగొండలో ధ్వంసమైన రేషన్ వ్యాన్లు

పెనుగొండ: రేషన్ సరుకులు అందిస్తున్న వ్యాన్లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పెనుగొండలో రెండు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి వెంకటేశ్వర్లు, దిగుమర్తి సుధాకర్‌లు రేషన్ వాహనాలను పెనుగొండ ఎస్‌బీఐ సమీపంలోనూ, చెరుకువాడ బ్రహ్మ ఆలయం సమీపంలోనూ పార్కు చేశారు. తెల్లారేసరికి రెండు వాహనాల అద్దాలను ఇటుకలతో పగలగొట్టారు. దీంతో పాటు సీఎం జగన్ చిత్ర పటంపై గీతలు గీయడంతో ఉద్దేశ పూర్వకంగానే దాడి చేసినట్లు స్థానికులు భావిస్తున్నారు. దాడిపై పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం

ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నాటుసారా తయారీ, రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. నాటుసారా తయారీ, మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు. నాటుసారా తయారీపై ఆకస్మిక తనిఖీలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖైనీ, గుట్కా, గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. పల్లె సీమల్లో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తాటాకులగూడెం చెక్‌పోస్టు వద్ద గంజాయి రవాణాను అరికట్టిన ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డిని సత్కరించారు. సమీక్షలో ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ పనితీరు చూపిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

హెచ్‌ఐవీ బాధితులకు వ్యాక్సిన్లు

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల జీవితకాలాన్ని పెంచేందుకు ప్రభుత్వం నూతన ఆవిష్కరణలు ప్రవేశపెడుతుందని జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివప్రసాద్ అన్నారు. జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్‌లో సోమవారం హెపటైటిస్ బీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే క్రమంలో ఇతర వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా టీబీ, హెపటైటిస్ బీ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు.



తణుకులో హెచ్‌ఐవీ బాధితులకు వ్యాక్సిన్ వేస్తున్న శివప్రసాద్

క్లుప్తంగా

ఉమా చంద్ర మౌళీశ్వర స్వామికి విశేష పూజలు



శంకరమఠంలో స్పటిక లింగానికి విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని చిన్నవంతెన వద్ద వేంచేసియున్న శంకరమఠంలో సోమవారం ఉమా చంద్ర మౌళీశ్వరస్వామికి, స్పటిక లింగానికి విశేష పూజలు జరిగాయి. మాఘ మాసం సందర్భంగా అర్చకులు ధూళిపాళ ఆదిత్య బ్రహ్మత్వంలో స్వామి వారికి ఏకవార శతరుద్రీయ అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు రెండు అర్జీలు అందాయని ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని, పీఎంఏవై బియ్యం రావడం లేదంటూ దరఖాస్తులు అందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్ల వితరణ



మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు భోజనం ప్లేట్లు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం గోదావరి విద్యావికాస్ చైతన్య సొసైటీ తరఫున రూ.25వేలు విలువైన 200 స్టీలు కంచాలను సొసైటీ కార్యదర్శి పేదూరి కాశయ్య సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి చుక్కయ్య, నవాబుపాలెం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు జద్దు హరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేలు నిబద్ధతతో చేయాలి

భీమవరం అర్బన్: ఏ ఒక్క లబ్ధిదారుడికి అన్యాయం జరగకుండా సర్వేలను నిబద్ధతతో చేయాలని ఎంపడీఓ రామచంద్ర ప్రభు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు సర్వేలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్, సిటిజన్ అవుట్ రీచ్ తదితర సర్వేలను క్షేత్రస్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిబద్ధతతో చేయాలని సూచించారు. కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: స్థానిక అందేబాపన్న జూనియర్ కళాశాలలో నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ సోమవారం చెప్పారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డులను వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు



కాళీపట్నం తూర్పులో కాలువలో మట్టి తొలగింపు పనులు చేస్తున్న కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల్లో పంటబోదెలతో పాటు డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు. సోమవారం సుమారు 450 మందికి పనులు కల్పించామని, అంతేకాక ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే పనులు కూడా చేపడుతున్నామని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు మండల గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని, మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వద్ద గృహసారథులు, వలంటీర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పార్టీ కార్యకర్తలకు, వలంటీర్లు, గృహసారథులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని పథకాలను అమలుచేసి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 3 లక్షల నుంచి రూ. 8 లక్షలు లబ్ధిని అందించారన్నారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు విద్య, వైద్యం, నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలకు అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అదే సమయంలో తెదేపా, జనసేన పార్టీల నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న కుట్రలను తెలియచేయాలన్నారు. గత ప్రభుత్వాలకు చెందిన ప్రజాప్రతినిధులు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వెనుకంజలో ఉంచిన విషయాలను తేటతెల్లం చేయాలన్నారు. గృహసారథులు, వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి సారథులన్నారు. ప్రజాప్రతినిధులందరూ ప్రజల్లో ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరింత బలపరచి నూరు శాతం విజయం సాధించేందుకు గృహసారథులు నడుం బిగించాలన్నారు. పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేసిన గృహసారథులు, వలంటీర్లకు భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డి వారికి అనుగుణంగా ఉపకారం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల ఎంపీపీ దాసరి హైమావతి, ముదునూరు సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి, నాయకులు సత్యనారాయణ, గుంబు మోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి ఇప్పటి వరకు తెదేపా, జనసేన పార్టీల్లో ఉన్న కొందరు పెంటపాడు మండల సభ్యులు సోమవారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని వైఎస్సార్‌సీపీ కండువాలతో మంత్రి కొట్టు సత్యనారాయణ ఆహ్వానించారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేయాలన్నారు. ఎవరికి ఎటువంటి కష్టం వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పెంటపాడు మండల నాయకులు మైలవరపు పెదబాబు, వెలగల సుబ్బిరెడ్డి, రాపాక సత్యనారాయణ తదితరులు తమ అనుచరులతో పార్టీలో చేరారు. భవిష్యత్తు ఎన్నికల్లో తమవంతు బాధ్యత నిర్వహించిన పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు.

జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్



మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ మర్లపాటి వీరవెంకట సుబ్బలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరుగొలను పశువైద్యాధికారి డాక్టర్ టి.దివ్యశ్రీ మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో వచ్చే ఈ వ్యాధిని మేకల ప్లేగు, పారుడు వ్యాధిగా పిలుస్తారన్నారు. పారామిక్సోవిరిడి జాతికి చెందిన మార్బిల్లి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. 200 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌ఏ నరేష్, జీవాల పెంపకందారులు పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సిబ్బంది సాంకేతికతలో నైపుణ్యం అవసరమని, క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు వీకర్స్‌కాలనీ, కడకట్ల, యాగర్లపల్లి, బేబి సెంటర్‌లను సోమవారం ఆమె సందర్శించారు. సిబ్బందికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతివారం జరుగుతున్న ప్రతి శుక్రవారం డ్రై డే పాటించే విధంగా కృషి చేద్దామన్నారు. వెక్టర్ నియంత్రణ ఫీవర్ సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, గృహ సందర్శనాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన చేయాలని, దోమల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన చేద్దామన్నారు. డీపీఎంఓ రమేష్ మాట్లాడుతూ కుష్టివ్యాధి గ్రస్తులు గుర్తించి, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ వారికి అవసరమైన వైద్య సహకారం అందిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ పర్సన్ వారూనిక, సుజాత, ప్రసూన, ఆశాలు, ఆరోగ్య కార్యదర్శులు, సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు పాటించాలి



భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

సాక్షి, భీమవరం: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం ఆహారపదార్థాల కొలతలు, వండే విధానంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆహార పదార్థాలు రుచికరంగా తయారు చేస్తేనే ఎక్కువ మంది పాఠశాలలో భోజనం చేస్తారన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.సుధారాణి, ఈశ్వరి, టి.జోత్స్న, పి.జ్ఞానమూర్తి, పీఎం రాధాకృష్ణ, కేవీవీ సూర్యనారాయణ, ఎం.సీతారామ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగిస్తే భవిష్యత్ అంధకారం

ఆకివీడు: మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా వంటి చర్యల్ని ప్రభుత్వం నిషేధించిందని, అటువంటి వాటిని కలిగి ఉన్నా నేరమేనని ఎక్సైజ్ సీఐ రామరారావు అన్నారు. సోమవారం దుంపగడపలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదభరితమైన డ్రగ్స్ వినియోగంతో శరీర అవయవాలు కుంచించుకుపోతాయన్నారు. ఎస్సై కే.రాజారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగానికి కొంత మంది విద్యార్థులు అలవాటు పడుతున్నారని, అది ప్రమాదకరమని హెచ్చరించారు. విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని చెప్పారు. ఎవరైనా వాటిని వినియోగించినా, రవాణా చేసినా 14500 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కాలేజీలో మాదక ద్రవ్యాల వినియోగ నిషేధిత కమిటీని ప్రిన్సిపాల్ కే.సుజాత అధ్యాపకులు, విద్యార్థులతో ఏర్పాటు చేశారు.

దుకాణాల్లో తూకం మోసాలపై తనిఖీలు

కాళ్ల: కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో కాళ్ల గ్రామంలోని సినిమా హాల్ సెంటర్లోని మాంసం దుకాణంలో కేజీకి సుమారు 100 గ్రాముల తేడా రావడంతో కేసు నమోదు చేశారు. రాంబాబు మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా స్టాంపులు లేని కాటాలకు స్టాంపులు వేశామన్నారు. తూనికలు, కొలతల విషయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. వినియోగదారులను మోసం చేసే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి పరామర్శ



గొల్లపూడిలో రఘురామ్‌ను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి మృతికి రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. సోమవారం గొల్లపూడిలోని ఆయన నివాసానికి వెళ్లి మంత్రి కారుమూరి పరామర్శించారు. రఘురామ్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్ బి టీకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ ఒక వరం అని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో సోమవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఆదేశాలు మేరకు ఏఆర్‌టీ సెంటర్లో వ్యాక్సిన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రూ.3 వేల విలువైన టీకాలను ఏఆర్టీ కేంద్రాల్లో వైద్యుల పర్యవేక్షణలో నెలకు ఒక డోస్ చొప్పున మూడు డోసులు ఉచితంగా వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏరియా ఆసుపత్రి పరిధిలో 5,184 మందికి ఈ వ్యాక్సిన్ అందజేశారు. ఆర్ఎంఓ డా.నాయక్, డా. బీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐద్వా శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ రాజకీయ శిక్షణ తరగతులు ఫిబ్రవరి 25, 26 తేదీల్లో తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్నందున జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ వెల్లడించారు. మహిళల సమస్యల పరిష్కారంలో ఐద్వా ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 2 లక్షలు సభ్యులు ఉన్న పెద్ద సంఘంగా ఐద్వా ఉందన్నారు. సాంఘిక దురాచారాలను ఎదుర్కొవడంలోను, చట్టాలను కాపాడేందుకు, ఐద్వా ఎప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. అందరూ సోదర భావంతో మెలిగే సమాజానికై కృషి చేస్తున్నట్టు వెల్లడించారు.

ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయించాలి



తహసీల్దార్ ఏవీ రామాంజనేయులకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘం నాయకులు

అత్తిలి: వీఆర్ఏలను ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయించాలని వీఆర్ఏల సంఘ భీమవరం డివిజన్ అధ్యక్షుడు బీవీఏవీ పండు కోరారు. ఈ సందర్భంగా సోమవారం అత్తిలిలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ నెట్‌వర్క్ సిగ్నల్ సౌకర్యం అంతంత మాత్రంగా ఉండటం వల్ల హాజరు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వీఆర్ఏలకు ఫేస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు లంకపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాపాక ఏసురత్నం, కార్యదర్శి తాను కొండ జాన్‌మోషే, కోశాధికారి టి లక్ష్మి, వీఆర్ఏలు మేకా వీరరాఘవులు, కె నారాయణరావు, అడపా బుల్లబ్బాయి, రుబీనా, దిద్దే బేబి, క్రాంతికుమార్, గెద్దం సుబ్బారావు, గుండేపల్లి గంగయ్య, గంటా హనుమంతు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్ష



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ నాగ ప్రసాద్

పాలకోడేరు: హెల్మెట్లు ధరించడం తలకు భారం కాదని, ఆపదలో ప్రాణరక్షణకు సహాయపడుతుందని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. శృంగవృక్షంలో హెల్మెట్ ధారణపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు లేనందున ప్రమాదాల సమయంలో తలకు గాయాలు అవ్వడం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్ర రావు సిబ్బంది ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల ట్రక్కు ఆటో సీజ్

పెంటపాడు : కోళ్ల వ్యర్థాలు అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని అలంపురం నుంచి నిడమర్రు మండలానికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఆటోను పోలీసులు సోమవారం సాయంత్రం గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఆటో

9 వేల ఎకరాలకు ఈ క్రాప్ నమోదు

భీమవరం అర్బన్: మండలంలో దాళ్వా సాగుకు సంబంధించి 9 వేల ఎకరాలలో ఈ–క్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో సుమారు 9,200 ఎకరాలలో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారని ఇంతవరకు 9 వేల ఎకరాలలో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ–క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జట్లపాలెంలో రెండోరోజు గడపగడపకు ప్రభుత్వం



వెలమపేటలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జట్లపాలెం గ్రామంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అందిస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా, వాటిపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొన్నారు. గ్రామంలో సచివాలయం నుంచి కోనేరు చెరువు, వెలంపేట, పెద్దవీధిలోని పలు ప్రాంతాలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు చేసిన ఎన్నికల వాగ్దానాలు తుంగలో తొక్కారన్నారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దుచేయలేదని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. నేడు ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. గ్రామంలో టీడీపీ నాయకులు చంద్రబాబులా దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా గూడెం నుంచి పడాల, జట్లపాలెం, కాగుపాడు, పెంటపాడు రోడ్డు, ఉమామహేశ్వరం తదితర రహదారులు వేశామన్నారు. దీంతో పాటు, ఈ చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి కోసం ఎంతో సొమ్ములు వెచ్చించామన్నారు. ఎస్సీ ఏరియాలో తాగునీటి అభివృద్ధికి ప్లాంట్ అందిస్తామన్నారు. చెరువుల అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్నారు. గతంలో వైఎస్సార్ హయంలో, నేడు జగనన్న కాలంలోనే అభివృద్ధి చెందుతోందన్నారు. జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో జలజీవన్ నిధులు నూరు శాతం పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. ప్రధానంగా తాగునీటితో పాటు, డ్రైనేజీ సమస్య ప్రధానంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి అందించడంతో పాటు, డ్రైనేజీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో పనిచేస్తున్నందుకు గర్వపడాలన్నారు. అందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్లతో పాటు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యసెంటర్, ఇతర భవనాలు ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. హామీలు కూడా నూరుశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ, జనసేన చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. చెప్పింది తప్పక చేసే నేతను ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, వైఎస్సార్ సేవాదళ్ మండల కన్వీనర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, బూరాడ శ్రీనివాస్, సర్పంచ్ మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, పార్టీజిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షుడు కె.కృష్ణప్రసాద్, వైస్ ఎంపీపీ కొణతాల, ఎంపీటీసీ సభ్యు లు రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, దేవాబత్తుల నాగమణి బాబి, పార్టీ నాయకులు విప్పర్తి శ్యాం, సిహెచ్ ఇజ్రాయేల్‌రాజు, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.